క్లుప్తంగా

ఘనంగా పైడిమాంబ అమ్మవారి జాతర



దీన్‌దయాల్‌పురంలో పైడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న మొల్లి

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని దీన్ దయాల్‌పురంలో మంగళవారం పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో చినగదిలి, సంతపాలెం, దీన్‌దయాల్‌పురం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పైడిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. దీన్‌దయాల్‌పురం గౌతమీ సేవా సంఘం సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జి.విక్టర్, పల్ల దుర్గారావు, మువ్వల సురేష్, గోవింద్ తో పాటు గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుష్పయాగానికి పువ్వుల తరలింపు



వివిధ రకాల పుష్పాలతో భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీ గోవిందరాజ స్వామివారి పుష్పయాగానికి అవసరమైన పుష్పాలను విశాఖ నుంచి తిరుమలకు తరలించారు. కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పూలను సేకరించారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద ఈ పుష్పాలను భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. అనంతరం మహిళా భక్తులు ఈ పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాక్ చేశారు. సంకల్పం చెప్పుకొని, శాస్త్రోక్తంగా పుష్పయాగం కోసం ఈ పూలను తిరుమలకు పంపించారు. ఆధ్యాత్మికవేత్త హిమాన్షు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ పుష్పాలలో 3,000 కలువలు, 2,000 తామరలతో పాటు వివిధ రకాల పూలు ఉన్నాయి.

గురుకులంలో వైద్య శిబిరం



శ్రీకృష్ణాపురం గురుకులంలో విద్యార్థులను పరీక్షిస్తున్న యూపీహెచ్‌సీ వైద్యులు

ఆరిలోవ: వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని, మంగళవారం జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని శ్రీకృష్ణాపురంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి, జ్వరాలను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్వరాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి మహిత విద్యార్థులకు జ్వరాల పట్ల అవగాహన కల్పించారు. వర్షాకాలం కావడంతో మలేరియా జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. జ్వరాల బారిన పడకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తరగతి గదులు, హాస్టల్ గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె ప్రత్యేకంగా సూచించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, గురుకుల సిబ్బంది, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

బీచ్‌రోడ్డు: రేసపువానిపాలెంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఒక మహిళ, ఒక విటుడు, వ్యభిచార నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేసపువానిపాలెంలో నివాసం ఉంటున్న గిరిజ నాగలక్ష్మి, బోస రామకృష్ణ ఓ ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి, వ్యభిచార నిర్వాహకులైన గిరిజ నాగలక్ష్మి, బోస రామకృష్ణతో పాటు విటుడు గోవింద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఒక యువతిని రక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసి, పట్టుబడిన వారిని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు.

ఎంవీపీ రైతుబజార్‌కు కొత్త శోభ



రైతు బజార్‌లో అందుబాటులోకి వచ్చిన కోల్డ్ స్టోరేజ్ రైఫెనింగ్ చాంబర్

- డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ
- వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సులభ్ కాంప్లెక్స్‌కు హంగులు
- రూ.9 లక్షల వ్యయంతో పనులు



డ్రైనేజీ ఆధునికీకరణ పనులు నిర్వహిస్తున్న కార్మికులు



ఆధునికీకరించిన ఎంవీపీ రైతు బజార్ సులభ్ కాంప్లెక్స్





ఎంవీపీకాలనీ: నగరంలోని అతిపెద్ద రైతు బజార్లలో ఒకటైన ఎంవీపీ కాలనీ రైతు బజార్‌కు జిల్లా మార్కెటింగ్ శాఖ కొత్త హంగులు అద్దింది. ఈ బజార్‌ను ఒక మోడల్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపట్టిన పలు ఆధునీకరణ పనులు తాజాగా పూర్తయ్యాయి. దశాబ్దాలుగా రైతులు, వినియోగదారులకు సేవలందిస్తున్న సులభ కాంప్లెక్స్‌ను పూర్తిగా ఆధునీకరించారు. అలాగే రైతు బజార్ అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను కూడా మెరుగుపరిచారు. ఈ పనుల కోసం మొత్తం రూ. 9 లక్షలు ఖర్చు చేశారు.

సులభ్ కాంప్లెక్స్ ఆధునీకరణ: మహిళలు, పురుషుల కోసం ప్రత్యేక విభాగాలు, వాష్ ఏరియాలో టైల్స్ నిర్మాణం, ఆధునాతన కమోడ్స్, బాత్‌రూమ్‌లకు కొత్త డోర్లు, ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. కాంప్లెక్స్‌కు కొత్త రంగులు అద్దారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల: గతంలో సమస్యగా ఉన్న రైతు బజార్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించారు. పాత డ్రైనేజీని తవ్వి పూడిక తొలగించడంతో పాటు వాల్స్‌ను పునరుద్ధరించారు. గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థను తిరిగి అందుబాటులోకి తెచ్చారు.

100కు పైగా స్టాల్స్

ఎంవీపీ రైతు బజార్‌లో 100కు పైగా స్టాల్స్ ఉండగా, ఉదయం, మధ్యాహ్నం వేళల్లో సుమారు 200 మంది రైతులు ఇక్కడ విక్రయాలు జరుపుతున్నారు. నిత్యం వేల మంది వినియోగదారులు ఇక్కడికి వస్తుంటారు. ఈ ఆధునీకరణ పనుల ద్వారా రైతులతో పాటు వినియోగదారులకు కూడా మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త హంగులు ఎంవీపీ రైతు బజార్‌ను ఇతర బజార్లకు ఆదర్శంగా నిలుపుతాయని మార్కెటింగ్ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన పెంచుతున్నాం

ఎంవీపీ రైతు బజార్ యంత్రాంగం చేసిన వినతి మేరకు జిల్లా మార్కెటింగ్ శాఖ ఇటీవల పలు సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. వీటిలో ముఖ్యంగా సులభ్ కాంప్లెక్స్ ఆధునీకరణ, కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థ పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ వంటివి ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఈ సౌకర్యాల వినియోగంపై రైతులకు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తూ ఈ మెరుగైన సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– వరహాలు, ఈవో, ఎంవీపీ రైతుబజార్

పలువురికి పదవీ విరమణ సత్కారం



పార్థసారథి, ఆఫీస్ అసిస్టెంట్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌లో అసోసియేట్ అధ్యాపకుడు ఎస్. పార్థసారథి, ఆఫీస్ అసిస్టెంట్ కేఈ ప్రసాద్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ కేవీ రమణ ఆధ్వర్యంలో వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పార్థసారథి, ప్రసాద్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

తల్లీకుమార్తె అదృశ్యంపై కేసు నమోదు

ఎంవీపీకాలనీ: శివాజీపాలెం ఆరుకుళాయిలు కూడలికి చెందిన బొమ్మిడి లక్ష్మి, ఆమె కుమార్తె సాయి మధులత అదృశ్యంపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గత కొన్ని రోజులుగా లక్ష్మికి, ఆమె తల్లికి మధ్య ఆర్థిక విషయాలపై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత నెల 30న లక్ష్మి తన కుమార్తె మధులతతో కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. లక్ష్మి కుమారుడు అవినాష్ అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి, సాయంత్రం 6 గంటలకు తిరిగి వచ్చేసరికి తల్లి, సోదరి ఇంట్లో లేకపోవడంతో కంగారు పడ్డాడు. బంధువుల ఇళ్లలో వెతికినా వారి ఆచూకీ లభించకపోవడంతో, అవినాష్ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతరం సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్

మద్దిలపాలెం: ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాలు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. నరసింహారావు అన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహించిన వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ శరవేగంగా మారుతున్న సాంకేతికతలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నేటి తరం సాంకేతిక యుగంలో ప్రయాణిస్తోందని గుర్తించాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నూతన జ్ఞానాన్ని అందించి, జ్ఞానాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒకటిగా నిలుస్తోందని ప్రశంసించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. సీతా మాణిక్యం మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు కూడా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలలో అవకాశం కల్పించాలని కోరారు. అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో యువతకు ఉపయుక్తంగా నిలిచే కార్యక్రమాల నిర్వహణను ఆమె ప్రశంసించారు. అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీవెన్ మాట్లాడుతూ, విద్యార్థులకు నూతన నైపుణ్యాలను అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు స్వశక్తితో ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. రెండు వారాల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా వెబ్ డిజైనింగ్ చేయగల సామర్థ్యాన్ని పొందారని, మొత్తం 56 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు.

భాషా సాహిత్యాల సవ్యసాచి ఆచార్య తూమాటి దోణప్ప



దోణప్ప చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య నరసింహారావు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో ఆచార్య తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆచార్య జిల్లా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆచార్య తూమాటి దోణప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ తూమాటి దోణప్ప గొప్ప పరిశోధకుడని, ఆయన జీవితం పరిశోధకులకు ఆదర్శమని కొనియాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని, అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం మన భాషకు ఇచ్చే గౌరవమని అన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్రె అప్పారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో దోణప్ప శత జయంతి ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. దోణప్ప ప్రియ శిష్యుడు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ఈ సభకు రావడం సభకు నిండుదనం తెచ్చిందని పేర్కొన్నారు. దోణప్ప తెలుగు భాషా సాహిత్యాలకు ఎంతో కృషి చేశారని, తెలుగు వ్యుత్పత్తి పదకోశంలోనూ పనిచేశారని గుర్తుచేశారు. విశిష్ట అతిథి ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆత్మీయ అతిథి ఆచార్య గజ్జ యోహాన్ బాబు, ఆచార్య వెలమల సిమ్మన్నలు కూడా దోణప్ప పరిశోధనల గొప్పతనాన్ని, రచనల ప్రాముఖ్యతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీవీకే కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డి.వి. సూర్య, తెలుగు విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ ఖజానాకు జీఎస్టీ వెన్నెముక



ఏయూ వీసీని సత్కరిస్తున్న ఎంపీ భరత్, జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఎంఆర్‌ఆర్‌రెడ్డి తదితరులు

మద్దిలపాలెం: జీఎస్టీ అమలులోకి వచ్చి 8 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విశాఖ సెంట్రల్ జీఎస్టీ జోన్ మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జీఎస్టీ అనేది కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఒక మిషన్ మోడ్ ప్రక్రియలో భాగమని, ఇది దేశ ఖజానాకు వెన్నెముక వంటిదని అభివర్ణించారు. జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో పన్ను అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ దేశ ఖజానాకు పరోక్ష పన్నుల విభాగం అందిస్తున్న సేవలను ప్రశంసించారు. జీఎస్టీ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ మాట్లాడుతూ, విశాఖ జోన్‌లో కేంద్ర పాలిత పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2017లో 58,000 నుంచి 2024-25 నాటికి 1.80 లక్షలకు పెరిగిందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వీరు ప్రభుత్వ ఖజానాకు రూ. 25,028 కోట్లు ఆదాయాన్ని అందించారని వివరించారు.కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఎంఆర్‌ఆర్ రెడ్డి, డీజీజీఐ ఎస్. శ్రీధర్, ప్రిన్సిపల్ కమిషనర్ రవి కిరణ్ ఈదర, అడిషనల్ డైరెక్టర్ జనరల్ నాసిమ్ వంటి పలువురు సీనియర్ అధికారులు ప్రసంగించారు. అనంతరం టాప్ పన్ను చెల్లింపుదారులైన చంద్ర బల్క్ కార్గో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మహధన్ అగ్రిటెక్ లిమిటెడ్, మై హోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అత్యుత్తమ సేవలు అందించిన 14 మంది శాఖాధికారులకు కూడా ప్రశంసాపత్రాలు అందజేశారు.

మెడికవర్‌లో ఘనంగా డాక్టర్స్ డే



జాతీయ డాక్టర్స్ దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆసుపత్రిలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు బిధాన్ చంద్ర రాయ్‌కు నివాళులర్పించారు. పలువురు డాక్టర్లు మాట్లాడుతూ వైద్య రంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. వైద్యులు నిస్వార్థ సేవకు, అంకితభావానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఆపరేషన్ థియేటర్‌లో మనిషి జీవితాన్ని నిలబెట్టే క్షణాలను దేవుడు తమకిచ్చిన గొప్ప వరంగా ప్రతి వైద్యుడు భావించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్విన్‌కుమార్ పండా, డాక్టర్ సురేష్ తాతినేనితో పాటు మెడికవర్ వైద్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రిటర్నింగ్ వాల్‌ను పరిశీలించిన మేయర్



రిటర్నింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న మేయర్

బీచ్‌రోడ్డు: నగరంలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా, కొండ ప్రాంతాల్లోని రిటైనింగ్ వాల్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం ఆయన 4వ జోన్, 28వ వార్డు, జై సంతోషి మాత కాలనీలోని కొండవాలు ప్రాంతంలో ఉన్న రిటైనింగ్ వాల్ నుంచి సమీపంలోని అపార్ట్‌మెంట్ పార్కింగ్ ప్రదేశంలోకి వస్తున్న వర్షపు నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వర్షపు నీటి లీకేజీని అరికట్టడానికి రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని సూచించారు. అలాగే వర్షపు నీటితో కాలువలు పొంగిపొర్లకుండా కాలువల మరమ్మతులు చేపట్టాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్లు కె.వి.ఎన్. రవి, పి.వి.వి. సత్యనారాయణ రాజుతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఏ విద్యార్థులు, సిబ్బంది

డాబాగార్డెన్స్: ఛార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ విద్యా సంస్థ మాస్టర్‌మైండ్స్‌లో మంగళవారం రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మాస్టర్‌మైండ్స్ సీఏ విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైజాగ్ బ్రాంచ్ మాస్టర్ మైండ్స్ కళాశాల అడ్మిన్ ప్రిన్సిపాల్ చల్లా అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను చదువు, నైపుణ్యంతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా దేశ భక్తిని ఇనుమడింపజేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, మాస్టర్ మైండ్స్ వైజాగ్ బ్రాంచ్ అకడమిక్ ప్రిన్సిపాల్ ఎస్.దినేష్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ కష్టాలకు చెక్



పల్లంగా ఉన్నప్పుడు సూర్యతేజానగర్ వద్ద రోడ్డుపై చేరిన వర్షం నీరు(నాడు)



నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్తగా నిర్మించిన రోడ్డు, వంతెన (నేడు)

ఆరిలోవ: చిన్నగదిలి సాయిబాబా గుడి నుంచి సూర్యతేజానగర్ మీదుగా అంబేద్కర్‌నగర్ వైపు జీవీఎంసీ 2023లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు, అలాగే బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ఆ ప్రాంత ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య, వర్షపు నీటి నిల్వకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం లభించింది.

గతంలో ఎదురైన ఇబ్బందులు

గతంలో ఈ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు పల్లంగా ఉండేది. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా సూర్యతేజానగర్ ముందు భారీగా వరద నీరు చేరి, చెరువును తలపించేది. వర్షాకాలంలో ఈ కాలనీవాసులతో పాటు అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డుపై నిల్చున్న వరద నీటిలో గోతులు కనిపించక ప్రమాదాలు కూడా జరిగేవి.

నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవతో పరిష్కారం

మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కృషితో జీవీఎంసీ 2023లో ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 2.35 కోట్లతో 20 అడుగుల రోడ్డును 80 అడుగుల వెడల్పుతో డబుల్ రోడ్డుగా నిర్మించారు. అదనంగా సుమారు రూ. 2 కోట్ల జీవీఎంసీ నిధులతో వంతెన కూడా నిర్మించారు. రోడ్డు, వంతెన నిర్మాణంతో సూర్యతేజానగర్ వద్ద ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కారమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవతోనే దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించిందని స్థానికులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఏయూక్యాంపస్: బీసీ సామాజిక వర్గానికి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనతో పాటు కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, తక్షణమే బీపీ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, కార్యదర్శి పెదిరెడ్ల శ్రీనివాస్, విశాఖ జిల్లా ఇంచార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇంచార్జి బర్ల పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలువ అంచు



ఇందిరానగర్ ఆర్చ్ వద్ద ప్రమాదకరంగా కాలువ అంచు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధిలోని పాత డెయిరీఫారం దరి ఇందిరానగర్‌కు వెళ్లే మలుపు వద్ద కాలువ అంచు ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఈ ఆర్చ్ మలుపు వద్ద లోతైన కాలువ అంచు శిథిలమైంది. ఇక్కడ రక్షణ గోడ కూడా లేకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీకి వెళ్లే వాహనదారులు మలుపు తిరుగుతున్న సమయంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోతున్న సందర్భాలు అనేకం. వారం రోజుల క్రితం చీకటిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక వ్యక్తి ఈ కాలువలో పడి గాయాలపాలయ్యాడు. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సచివాలయం సిబ్బందికి, జీవీఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం కనిపించలేదని స్థానికులు వాపోతున్నారు. పెద్ద ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి, వెంటనే ఇక్కడ కాలువకు రక్షణ గోడ నిర్మించాలని వారు కోరుతున్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ మేనేజర్‌గా వరప్రసాద్



స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్న వావ్ ప్రతినిధులు

మురళీనగర్: శ్రీలంకలోని దియాగామాలోని మహీంద్ర రాజపక్షే స్టేడియంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న 38వ శ్రీలంక ఇంటర్నేషనల్ మాస్టర్స్ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025కు ఇండియా టీమ్ మేనేజర్‌గా ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ మంగ వరప్రసాద్ ఎంపికైనట్లు విశాఖ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (వీఏఏవీ) తెలిపింది. ఈమేరకు మురళీనగర్ సెక్టార్-8లోని వావ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయనను అసోసియేషన్ తరుపున అభినందించారు. ఈ పోటీల్లో భారతదేశం నుంచి 210 మంది అథ్లెటిక్స్ పాల్గొంటారు. ఆయనతో పాటు వావ్ కోశాధికారి ఎం.రామారావు గురువారం శ్రీలంక బయలుదేరి వెళ్తారు. కార్యక్రమంలో జనకులం ఫౌండేషన్ ధర్మకర్త, వావ్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ యూత్ చైర్ పర్సన్, వావ్ పీఆర్‌వో వంశీ చింతలపాటి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ పాల్గొని వారికి స్పోర్ట్స్ కిట్స్, డ్రస్‌లు అందించారు.